# ఆధునిక
# దక్షిణ భారతదేశం

పదిహేడవ శతాబ్ది నుండి నేటివరకు

## రాజ్‌మోహన్ గాంధీ

తెలుగు సేత

దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | | xii |
| పరిచయం | | xvii |
| 1. | క్షితిజరేఖపై నౌకలు : 1498–1697 | 1 |
| 2. | నేలమీద ఫిరంగులు : 1700 – 1761 | 36 |
| 3. | మదిలో మంటలు: 1761–1807 | 78 |
| 4. | తిరుగుబాట్లు – గ్రామీణ జీవనం : 1774–1823 | 145 |
| 5. | ఆత్మనుండి పుట్టిన పాటలు : 1805–1847 | 175 |
| 6. | పాలనకోసం అధ్యయనం : 1800–1855 | 202 |
| 7. | రాణికొక కానుక : 1799–1883 | 232 |
| 8. | సంస్కరణకు కట్టుబడి : 1877–1901 | 263 |
| 9. | శత్రువును నిర్వచించడం : 1901–1925 | 295 |
| 10. | కారాగారం నుండి ఫోర్ట్ సెయింట్ జార్జ్‌కి : 1920–1939 | 346 |
| 11. | స్వాతంత్ర్యం : 1939–1948 | 385 |
| 12. | పాత పటాలకు కొత్త పటాలు : 1948 – 1957 | 434 |
| 13. | న్యూఢిల్లీలో సమీకరణాలు : 1957–1977 | 468 |
| 14. | నొప్పి, నాటకం, అనుగ్రహం: 1980–2000 | 504 |
| 15. | విహారయాత్రకు ముగింపు : 2000–2018 | 542 |

అధ్యాయం – 1

# క్షితిజరేఖపై నౌకలు : 1498–1697

1565 లో ఉమ్మడిగా విజయనగరాన్ని ఓడించిన తర్వాత దక్కనులోని బీజాపూరు, అహ్మద్‌నగరు, గోల్కొండ, బీదరు సుల్తానులు విడిపోయారు. అక్బరు 1605 వరకు జీవించి ఉన్నప్పటికీ, మొగలు సామ్రాజ్యాన్ని గణనీయంగా విస్తరించినప్పటికీ ఉత్తరాన దూరంగా ఢిల్లీలోనో, ఆగ్రాలోనో రాజధాని ఉండడం వల్ల దక్షిణ ద్వీపకల్పంపై ఆధిపత్యం గురించి ఆలోచించలేకపోయాడు.

స్థానిక సుల్తానులు లేదా నాయకులు దక్షిణదేశపు వెనుకతట్టు ప్రాంతాలలో భూభాగాలపై ఆధిపత్యం నెరపుతూ ఉండగా, పోర్చుగల్ అనే చిన్న ఐరోపాదేశం నుండి వచ్చిన నావికులు, మతప్రచారకులు అప్పటికి చాలాకాలం ముందే ఉభయతీరాల్లోనూ తమను దృఢంగా స్థాపించుకున్నారు. 17వ శతాబ్ది ప్రారంభానికి 102 సంవత్సరాల పూర్వం నాలుగు ఓడల దళానికి నాయకత్వం వహించి వాస్కోడ గామా మలయాళతీరంపై కాలుమోపాడు. ఈ ఓడలు ఫిరంగులతో సాయుధమై ఉన్నాయి. అతని సాగరయాత్ర తొమ్మిది నెలలు సాగి, 1498 మే 20న కోళిఖోడ్ చేరుకుంది.

అప్పటివరకు ఐరోపానుండి భారతదేశానికి సముద్ర మార్గాన ఎవరూ ప్రయాణించలేదు. నూటపది సంవత్సరాల తర్వాత 1608 లో డచ్చివాళ్లు తూర్పుతీరంలోని పులికాట్‌లో దిగారు. 1620 లో ఒక డేనిష్ ఓడల గుంపు ట్రాంకెబార్ (తరంగం బాడి) లో దిగింది. ఇది కూడా తూర్పుతీరంలోనే పులికాట్‌కు మరింత దక్షిణాన ఉంది. ఇక బ్రిటిషు, ఫ్రెంచివాళ్ల రాకకు పెద్ద ఆలస్యమేమీ జరగలేదు.

గుర్రాలు తమడెక్కల చప్పుళ్లు, అవి లేపిన ధూళితో ఉత్తరభారతదేశానికి బాహ్యప్రపంచాన్ని ప్రకటించినట్లే, క్షితిజరేఖపై విస్తరిస్తున్న ఓడల తెరచాపలు తీరప్రాంత దక్షిణభారతీయులకు ఆగంతకుల రాకను హెచ్చరించాయి.

తమ రాజుల ప్రోత్సాహంతో ఐరోపానుండి ఈ ఓడలు వర్తకులను తీసికొని వచ్చాయి. వీళ్లు ఆయా తీరప్రాంతాల్లో 'ఫాక్టరీలు' స్థాపించారు. ఇది పెద్ద కష్టం లేకుండా తేలిగ్గానే జరిగింది. దేశంలోపలికి వచ్చే, బయటికి వెళ్లే వాణిజ్య సరుకులను ఈ ఫాక్టరీలలో ఉంచుతారు. సాధారణంగా ఇక్కడ ఒక కోట కూడా కడతారు. ఈ కోటలోపల యూరోపియన్, భారతీయ కిరాయి సైనికులు తమ యూరోపియన్ యజమానులు, వారి సరకులకు రక్షణ కల్పిస్తారు. తొలి దశాబ్దాలలో కోటలోపలికి వచ్చే దక్షిణ భారత వర్తకులకు, యూరోపియన్ వర్తకులతో సమానహోదా ఉండేది.

కేరళ తీరంలోని కోఝికోడ్ (కాలికట్) లో వాస్కో డ గామా దిగినప్పుడు అక్కడ జమొరిన్ అనే బలవంతుడైన పాలకుడుండేవాడు. పోర్చుగీసు వర్తక – అన్వేషకుడు ఈ పాలకునితో వ్యవహరించాలి. కోఝికోడ్‌కి ఈశాన్యంగా చాలా దూరంలో అప్పుడు పరాకాష్ఠ దశలో ఉన్న విజయనగర సామ్రాజ్యరాజధాని హంపి ఉంది. ఈ సామ్రాజ్యం నేటి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలోని అధికభాగంలో వ్యాపించి ఉంది. చరిత్రకారుడు బర్టన్ స్టెయిన్ అన్నట్లు:

> విజయనగరరాజుల్ని మొదటినుంచీ కన్నడిగులనో, తెలుగువారనో లేదా ఆ ఇద్దరూననో ఏమనుకున్నప్పటికీ వారి రాజ్యాధికారం మాత్రం దక్షిణ ద్వీపకల్పమంతటా వ్యాపించి ఉంది.[1]

డ గామా అడుగుపెట్టిన పదకొండేళ్లకు సింహాసనమధిష్ఠించిన కృష్ణదేవరాయలు విజయనగరాన్ని పరిపాలించిన చక్రవర్తులందరిలో గొప్పవాడు. 1509 నుండి 1529 వరకు పరిపాలించాడు. తెలుగులో కవి. వాస్తవానికి తుళు జాతీయుడు.[2]

విజయనగర పతనం తర్వాత డచ్చి, డేనిష్, బ్రిటిష్, ఫ్రెంచి వర్తకులు దక్షిణ భారతదేశంలో 'ఫాక్టరీ' నో, కోటనో ఏర్పరచుకోవడానికి ఆ ప్రాంత నాయకుడి నుండో, ఇంకా మిగిలి ఉన్న దక్కను సుల్తాను నుండో అనుమతి తీసుకోవలసి ఉంటుంది.

త్రిచి (తిరుచిరాపల్లి), తంజావూరు, మదురై వంటి తమిళ దేశ ప్రాంతాలు వేరు వేరు నాయక వంశాల అధీనంలో ఉన్నాయి. ఈ నాయకులు తెలుగువాళ్లు. పధ్నాలుగు, పదిహేను శతాబ్దాలలో తమిళ ప్రాంతాలలోకి వీరి ప్రవేశంతో వ్యవసాయకులాలకు చెందిన తెలుగు మాట్లాడే ప్రజలు గణనీయ సంఖ్యలో దక్షిణదిశగా వలస రావడానికి దారిపడింది.